క్లుప్తంగా

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: మండల రెండో ఎంఈఓగా రత్నశ్యామ్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన విద్యాశాఖ కౌన్సెలింగ్‌లో ఎంఈఓ-2గా ఆయన నియమితులయ్యారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మీ తదితరులు రత్నశ్యామ్ బాబును సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



చేగిరెడ్డిపాడు(జి.కొండూరు): చేగిరెడ్డిపాడు ఎంపీపీ పాఠశాలలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, స్వీట్లు శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు బాల్యం నుంచి మంచి నైతిక విలువలతో కూడిన విద్య అలవర్చుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సత్యసాయి సమితి సభ్యులు కె.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.రమాదేవి, పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రోస్లీ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సోదర భావంతో కలిసిమెలసి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని చిల్లబోయినపల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం దాడిచేసి, ఏడుగురిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.33,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైభవంగా వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో వేడుకల్లో భాగంగా అమ్మవారికి శనివారం పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అలంకరణ అనంతరం సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజా కార్యక్రమాలను, సాయంత్రం పీఠం ఆవరణలోని యాగశాలలో హోమాలను నిర్వహించారు.

సారె సమర్పణకు తరలివస్తున్న భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గగుడి పాలక మండలి సభ్యుడు చింతా సింహచలం, పలు భక్త బృందాలు శనివారం అమ్మవారికి సారెను సమర్పించాయి. పాలక మండలి సభ్యుడు చింతా సింహచలం, విజయవాడ అపరాజిత సేవా బృందంతో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 600 మంది మహిళలు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు.

నవరసాల దృశ్యకావ్యం దేవదాసు

విజయవాడకల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నటజీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయిన చలనచిత్రం దేవదాసు అని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, శారదా కళాసమితి, మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కొల్లూరి మాట్లాడుతూ సావిత్రి, అక్కినేని నటన వారి జీవితంలో కొత్త పాత్రలకు జీవం పోసిందన్నారు. శారదా కళా సమితి అధ్యక్షుడు శంకర్రావు మాట్లాడుతూ దేవదాసు చిత్రం తెలుగు సినిమా చరిత్రలో క్లాసిక్‌గా నిలిచిపోయిందన్నారు. మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, సంస్థ లక్ష్యాలను వివరించారు.

సేవా నిలయాలు.. సచివాలయాలు

- ప్రజలకు అందుబాటులో సేవలు
- సిఫార్సులు లేకుండానే పథకాలు
- పారదర్శకతకు పెద్దపీట



తుక్కులూరులోని గ్రామ సచివాలయం

- మైలవరం మండలంలో సచివాలయాల సంఖ్య- 17
- పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్య - 54,352
- లబ్ధిపొందిన వారి సంఖ్య- 52,030

మైలవరం: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాధ్యమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులు సేవలందిస్తున్నారు. ఏ అవసరమొచ్చినా గ్రామాల్లోనే సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన అనే విషయం నిజమైంది. వలంటీర్ వ్యవస్థతో ప్రతి నెలా తెల్లవారుజామునే ఇంటి వద్దకే పింఛన్లు, రేషన్ పంపిణీ, సమస్యను సచివాలయంలో దరఖాస్తు చేసిన వెంటనే పరిష్కరించడం జరుగుతోంది. మైలవరం మండలంలో 17 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు వివిధ పథకాలకు సంబంధించి 54,352 దరఖాస్తులు వచ్చాయి. 52,030 మంది లబ్ధి పొందారు. మిగిలిన వారి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతంలో వీటి కోసం కార్యాలయాల చుట్టూ రోజులు తరబడి తిరగాల్సివచ్చేదని స్థానికులు చెబుతున్నారు. సచివాలయ వ్యవస్థతో అవసరమైన ధ్రువపత్రాలు తీసుకోవడం సులభంగా ఉందని చర్చించుకుంటున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నూజివీడు: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అందరి మన్ననలు పొందుతోంది. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేస్తున్నాయి. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి మండల కేంద్రాలకు వెళ్లే పనిలేకుండా ఉన్న ఊర్లోనే పాలన పరమైన సేవలు అందుతుండంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయాల ద్వారా జనన, మరణ, నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ దగ్గర నుంచి పాసు పుస్తకం, రేషన్ కార్డు, ఫ్యామిలీ సర్టిఫికెట్, ఎన్ఓసీ తదితర ధ్రువీకరణ పత్రాలు సైతం గ్రామ సచివాలయం ద్వారానే ప్రజలకు అందిస్తున్నారు. దీంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తప్పాయి. నూజివీడు నియోజకవర్గంలో 92 సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం సేవలు అందిస్తోంది. ప్రజలు ఏదైనా ధ్రువపత్రం కోసం సచివాలయంలో అర్జీని పెట్టుకుంటే 30 నిమిషాల నుంచి 72 గంటల్లో వాటిని అందిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన సేవలన్నీ పారదర్శకంగా అందుతుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డుల జారీ వంటి సేవలను కూడా సచివాలయాల్లో చేస్తున్నారు. ఎక్కడో మండల కేంద్రాల్లో ఉండే ఆధార్ సెంటర్లకు పదే పదే తిరిగి ఇటు సమయాన్ని, అటు డబ్బులను కోల్పోవాల్సిన పని ఇప్పుడు లేదు. ఈ సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం ప్రతి నెలా కొన్ని సచివాలయాలు ఎంపిక చేసుకుని నిర్దేశించిన తేదీల్లో వారం రోజుల పాటు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆధార్ కార్డులో మార్పులు, ఆధార్ కార్డు బదిలీ, కొత్త ఆధార్ నమోదు చేస్తున్నారు. మార్పులు, కొత్త ఆధార్ కోసం రూ.50 నుంచి రవంద వరకు తీసు కుంటున్నారు. ఆధార్ అప్డేట్, ఈకేవైసీ వంటి సేవలు ఉచితంగా ప్రజలకు అందుతున్నాయి.

జగనన్న వచ్చాక సొంత ఇంట్లో ఉంటున్నా..



చంద్రాల గ్రామంలో నాకు ఉన్న ఇంటిని కొడుకు, కోడలు తీసుకుని, నాకు ఇల్లు లేకుండా చేశారు. కొంత కాలం తెలిసిన వారి పంచలో ఉన్నాను. గ్రామ సచివాలయంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి పట్టా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాకు స్థలం ఇవ్వడమేగాక ఇంటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాను. గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.70 వేలు అదనంగా నిధులు మంజూరు చేయించడంతో ఇల్లు పూర్తి చేసుకుని ఆ ఇంట్లో ఉంటున్నాను.

– సత్యాల పద్మ, లబ్ధిదారు, చంద్రాల గ్రామం

ఆఫీసుల చుట్టూ తిరిగే పని తప్పింది



వార్డు, గ్రామ సచివాలయాలు రావడంతో ఆఫీసుల చుట్టూ తిరిగాల్సిన పని తప్పింది. గతంలో ఏదేని సర్టిఫికెట్ కావాలంటే ఆయా శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల్లో అన్ని శాఖల సేవలు అందుబాటులో ఉండటంతో ధ్రువపత్రాలు సులభంగా అందుతున్నాయి.

– గంపా విజయ్, నూజివీడు

ఇబ్బందులేమీ లేవు



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత ఇబ్బందులు ఏమీ లేవు. ఏ అవసరమైనా వలంటీర్‌ను పిలిచి చెబితే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తున్నారు. అవి నిర్ణీత గడువులోగా అందుతున్నాయి. గతంలో పనుల కోసం మండల కేంద్రమైన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలేవీ లేవు.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు

ప్రజల నుంచి మంచి స్పందన



సచివాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పెండింగ్ సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం. సచివాలయాల్లో అందుబాటులో వచ్చిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వీపీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ, నూజివీడు

సామాజికాభివృద్ధికి సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: సామాజిక అసమానతల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండలంలోని మల్లేలలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలోని సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసిన ఎమ్మెల్యే వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. జగనన్న చేదోడు, ఆసరా, వైఎస్సార్ చేయూత, తోడు తదితర పథకాలు పేదరిక నిర్మూలన ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలను మంజూరు చేయడం ధ్యేయంగా గ్రామ సచివాలయాలను ప్రారంభించిన ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. గ్రామ సర్పంచ్ వంగూరి మరియమ్మ, ఉప సర్పంచ్ సువర్చల, పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు రవికుమార్, ఏసుపాదం, వెంకట్ పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూజివీడు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని రహదారులను సిమెంట్ రోడ్లుగా, తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాల భూముల ధరలను పట్టణ నడిబొడ్డున ఉన్న కమర్షియల్ ఏరియాల్లోని భూముల ధరలతో సమానంగా పెంచేశారని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నంబరు 450/1లో వక్ఫ్‌బోర్డు అభ్యంతరాల వల్ల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, వెంటనే వక్ఫ్‌బోర్డు తెలిపిన అభ్యంతరాలు అసంబద్ధమని, వాళ్ల భూమి ఎక్కడ ఉందో వారే చూసుకోవాలి తప్ప ప్రజలకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ముస్లింల శ్మశాన వాటిక ఎక్కడ ఉందో దానికి చుట్టూ సరిహద్దుగా ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌ను ఆపాలే తప్ప ఆ సర్వే నంబరులో ఎన్ని ఎకరాలుంటే అన్నీ నిలిపివేయడమేమిటని ప్రశ్నించారు. దీనిపై ఉన్న నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని అన్నారు. దీనికి సబ్‌రిజిస్ట్రార్ తులసీరత్నం మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, మేనేజర్ మనోజ, కోఆప్షన్ సభ్యుడు మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష


రెడ్డిగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్

పైడూరుపాడు(విజయవాడరూరల్): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ప్రత్యేక అధికారి కె.శైలజ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా శనివారం పైడూరుపాడులో సర్పంచ్ వి.సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు బి.కల్పన, ఎంపీడీఓ శేషగిరిరావు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరి వివరాలను వెంటనే ఆన్‌లైన్లో నమోదు చేశారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం సచివాలయం-1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు చేపట్టిన సర్వేను ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఆయా ఇళ్ల వద్దకు అధికారులు వచ్చి ఇస్తారని పేర్కొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జగనన్న సురక్ష పథకంపై కొండపల్లి మున్సిపాల్టీలోని ఐదు సచివాలయాల పరిధిలో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మున్సిపాల్టీ సచివాలయాల కన్వీనర్ల కో-ఆర్డినేటర్ అంకమోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు పొందని వారు నష్టపోకూడదని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఇంటింటికీ తిరిగి వారు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి

గంపలగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు తమ పరిధిలో ప్రజల అవసరాలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను సమగ్రంగా ఉండాలని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈఓపీఆర్డీ బాబురావు పాల్గొన్నారు

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: జగనన్న సురక్ష పథకానికి సంబంధించి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని చంద్రుపట్ల గ్రామంలో శనివారం ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, డీటీ మోతీయా, కలగర గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్ పరిశీలించారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం



నూజివీడు: వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. దిగవల్లిలోని హైస్కూల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో డయేరియా, మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలుతాయని, వీటి వ్యాప్తిని నియంత్రించేందుకు మురుగునీరు నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి యలమంద పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే తక్షణ కర్తవ్యం

మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శైలజ


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శైలజ

మైలవరం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడమే ప్రతిఒక్కరి తక్షణ కర్తవ్యం అని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. శైలజ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు అధ్యక్షతన శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి శైలజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశం పేదరికం, జనాభా రీత్యా పెద్దదిగా ఉండటంతో బాల కార్మికులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 24 ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలు బాల కార్మికులుగా ఉండకూడదన్నారు. నిర్బంధంగా ఉచిత విద్యను అభ్యసించాలన్నారు. 1986 సంవత్సరంలో బాల కార్మిక వ్యవస్థ క్రమబద్ధీకరణ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. తరువాత 2016లో ఆ చట్టాన్ని సవరించి, బాల కార్మిక కౌమార నిర్మూలన నియంత్రణ యాక్టు రూపొందించిందని తెలిపారు. బాల కార్మికులతో పనిచేయించుకునే యజమానులపై కఠిన శిక్షలు అమలు చేయాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ప్రపంచ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలన దినం జరుగుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు గంజాయికి అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలను పర్యవేక్షించాలని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పావులూరి పద్మశ్రీ, వెలుగు ఏపీఎం శామ్యూల్, జూనియర్ న్యాయవాది దినేష్ ప్రసంగించారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనులు

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఏ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, పోలిశెట్టిపాడు పలు గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని ఏపీఓ జే రామారావు శనివారం తెలిపారు. 21 గ్రామా ల్లో 6,754 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారని, వీరికి అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

లబ్ధి పొందని వారికి న్యాయం చేయాలి

నూజివీడు: పథకాల ద్వారా లబ్ధి పొందని వారిని గుర్తించి, వారికి పూర్తిగా న్యాయం చేయాలని సచివాలయ జేసీఎస్ కన్వీనర్ నందూరు భాస్కర ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం, చొప్పరమెట్ల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావుపై చేస్తున్న విష ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం మన బాధ్యతన్నారు.

రేపు సాహోజీ మహరాజ్ జయంతి

తిరువూరు: రిజర్వేషన్లకు ఆద్యుడు, తొలి బహుజన రాజ్యాధిపతి సాహోజీ మహరాజ్ 150వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం తిరువూరులో నిర్వహించనున్నట్లు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కెపోగు వందనకుమార్ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు తిరువూరు బైపాస్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగే మహరాజ్ జయంతి కార్యక్రమానికి కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దేశంలో సుపరిపాలన

మైలవరం: దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందిస్తున్నారని భారతీయ జనతాపార్టీ కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ తొమ్మిది సంవత్సరాల సుపరిపాలనపై కరపత్రాలను మైలవరంలోని ఇంటింటికీ తిరిగి నాయకులు శనివారం పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు సాయిదాశరధి, యుగంధర్, శేఖర్, నరేంద్ర, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తోటమూల(గంపలగూడెం): రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మండలంలోని తోటమూల సీపీఎం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి, నాయకులు ఎం.వెంకటరెడ్డి, సీహెచ్ వీరారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు జానలపాటి వెంకటేశ్వరరావు, మీసాల గోపి పాల్గొన్నారు.

అగ్రికల్చరల్ కన్వీనర్‌గా పోతురాజు


ఎమ్మెల్యే వసంతను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పోతురాజు

ఇబ్రహీంపట్నం: మండల వ్యవసాయ కన్వీనర్‌గా మూలపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టిముక్కల పోతురాజు ఎంపికయ్యారు. వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో భాగంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆయన్ను కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా పోతురాజు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో రైతు విభాగం బలోపేతంచేసి రైతులతో సమన్వయం కలిగి ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

ఎరువులను బిల్లులు లేకుండా విక్రయించరాదు

నూజివీడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మండలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు బిల్లులు లేకుండా విక్రయించరాదని ఆగిరిపల్లి వ్యవసాయశాఖాధికారి పలగాని చెన్నారావు అన్నారు. ఆగిరిపల్లి వ్యవసాయ అధికారి కార్యాలయంలో డీలర్లకు ఏడీఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల షాపులకు డీలర్లకు ఎరువులను ఈ-పోస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే విక్రయించాలని తెలిపారు. డీలర్లు అందరూ అధీకృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మాత్రమే స్టాక్‌ను పొంది రైతులకు విక్రయించాలన్నారు. డీలర్లు అందరూ ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, డీలర్లు స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌ల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. డీలర్లు అందరూ స్టాక్ బోర్డు నిర్వహించాలని అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించరాదన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మైలవరం: స్థానిక చలువాది కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు కేశినేని శివనాథ్ శనివారం తెలిపారు. అన్ని వ్యాధులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.